సాక్షి జగిత్యాల

మంగళవారం, 8, అక్టోబర్, 2024

స్కందమాతగా అమ్మవారు

ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురిలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు రంగు చీరలో అలంకరించారు.



న్యూస్‌రీల్

దుర్గామాతను దర్శించుకున్న అడ్లూరి



పెగడపల్లిలో దుర్గాదేవి వద్ద పూజలు చేస్తున్న అడ్లూరి

పెగడపల్లి: మండలకేంద్రంలోని శివాలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విప్‌ను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ సర్పంచి శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

దుర్గమ్మ కృపతో మేలు చేకూరాలి



దుర్గాదేవిని దర్శించుకున్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: దుర్గాదేవి అమ్మవారి కృపతో ప్రజలందరికీ మేలు చేకూరాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగరరావు అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపేటలో నెలకొల్పిన అమ్మవారికి పూజలు చేశారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భవానీమాత కృపతో ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఎండీ.అమీన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బైరి రాకేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్వీ నాయకులు బైరి రవికుమార్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కాకతీయ కెనాల్‌కు 6800 క్యూసెక్కుల నీటి విడుదల



కాకతీయ మెయిన్ కెనాల్‌కు ప్రవహిస్తున్న సాగునీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాకు సాగు, తాగునీరు అందించే కాకతీయ మెయిన్ కెనాల్‌కు సోమవారం 6800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 21,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అదేస్థాయిలో ప్రాజెక్టు నుంచి బయటకు విడుదల చేస్తున్నారు. లక్ష్మి కెనాల్‌కు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231, వరద కాల్వకు 12వేలు, సరస్వతి కెనాల్‌కు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

మార్కెట్‌యార్డుకు సెలవు

జగిత్యాలఅగ్రికల్చర్: దసరా, బతుకమ్మ పండుగ సందర్భంగా జగిత్యాల మార్కెట్‌కు ఈనెల పదో తేదీ నుంచి 13వరకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. కొనుగోళ్లను తిరిగి 14 నుంచి యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

దుర్గాదేవికి బోనాలు



రాయికల్‌లో బోనాలతో సంఘమిత్ర మహిళలు



మైతాపూర్‌లో శాకంబరి దేవి అలంకరణలో అమ్మవారు

రాయికల్: రాయికల్ పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారిని సోమవారం శాకంబరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూరులో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దుర్గాదేవి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయికల్‌లోని నవదుర్గ, సంఘమిత్ర యువజన సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

డీఎస్సీలో అర్హతల పంచాయితీ

రావుల స్వాతి.. కరీంనగర్ జిల్లా నుంచి బీఈడీ చేసింది. 2012లో టెట్ పాసైంది. ఆమెకు స్పెషల్ ఎడ్యుకేషన్ ఇన్ డిప్లొమా ఉంది. స్పెషల్ బీఈడీ కోర్సులో చేరినా పూర్తి కాలేదు. అయినా, ఆమె పేరు తాజా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన 1:3 లిస్టులో ఉంది. అసలు స్పెషల్ బీఈడీ పూర్తి చేయకుండా టెట్ రాయడం నిబంధనలకు విరుద్ధమని, కేవలం 2024 సంవత్సరం డీఎస్సీ కోసం దరఖాస్తు చేసిన ప్రామాణిక అప్లికేషన్‌లో ఎంటర్ చేసిన వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని లఖన్‌బాబు అనే అభ్యర్థి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.

మాలోత్ రవి.. ఇతను 1 నుంచి 5వ తరగతి వరకు పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. కానీ, పెద్దపల్లి డీఎస్సీలో పోస్టులు లేవు. దీంతో, కరీంనగర్ పోస్టులకు పరీక్ష రాశాడు. ఇందుకోసం 1 నుంచి 5వ తరగతి వరకు కరీంనగర్‌లోని రాంనగర్ అరుణోదయ ప్రైమరీ స్కూల్లో చదువుకున్నట్లు దరఖాస్తు చేసుకున్నాడు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. అతను నాన్‌లోకల్ అయినా కరీంనగర్‌కు లోకల్ కేండిడేట్‌గా పరీక్ష రాసేందుకు రాంనగర్‌లో చదువుకున్నట్లు సర్టిఫికెట్లు తెచ్చాడన్న ఆరోపణలున్నాయి. ఇదే వ్యక్తి గ్రూప్–1, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, గ్రూప్–4 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నాడు. వాటిలో తాను పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేసినట్లు పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించి అతని దరఖాస్తులను పలువురు అభ్యర్థులు చూపిస్తున్నారు. అవి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒకే వ్యక్తి రెండు జిల్లాల్లో స్థానికుడిగా ఎలా పరీక్షలు రాస్తాడని జిల్లా ఉన్నతాధికారులను పలువురు నిలదీస్తున్నారు.



రవి డీఎస్సీ అప్లికేషన్‌లో అరుణోదయ ప్రైమరీ స్కూల్ (రాంనగర్)



గ్రూప్-2 అప్లికేషన్‌లో పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ ప్రగతి విద్యామందిర్ స్కూల్

- స్థానికత కోసం నకిలీ ధ్రువపత్రాల సృష్టి
- కరీంనగర్ స్థానికతతో పెద్దపల్లి అభ్యర్థి దరఖాస్తు
- బీఈడీకి ముందే టెట్ పాస్ చెల్లదంటున్న అభ్యర్థులు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

2008 డీఎస్సీలో జరిగిన తప్పిదాలకు ఉమ్మడి జిల్లా నుంచి 186 మందిలో మెరిట్ జాబితాలో ఉన్నవారిని తీసుకొని, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగావకాశాలు కల్పించాలని న్యాయస్థానం సూచించింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరిట్ జాబితాలో ఉన్నవారి విద్యార్హత సర్టిఫికెట్లను అధికారులు ఈ నెల 5వ తేదీ వరకు పరిశీలించారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కాకుండా రెండు రోజులు ఆలస్యంగా జాబితా ప్రదర్శించడం, మొదటిరోజు అందులో 13 మంది పేర్లు గల్లంతవడం, 25 మందిని కొత్తగా చేర్చడం వంటి అంశాలు హాట్ టాపిక్‌గా మారాయి.

కొత్త పేర్ల నమోదుపై ఆందోళన..

2008లో అప్పటి డీఈవో వెంకటేశ్వర్లు హయాంలో రూపొందించిన మెరిట్ జాబితా ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని, తమ పేర్లు గల్లంతయ్యాయని, కొత్త పేర్లు ఎలా నమోదయ్యాయో చెప్పాలంటూ అభ్యర్థులు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇది ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోవడంతో అధికారులు తీరుపై విమర్శలు చేశారు. వీరికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని హైకోర్టు చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో నియామక ప్రక్రియకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. అప్పటి మెరిట్ జాబితాలో తమ పేర్లు ఉన్నా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవలేదని, కొత్త పేర్లు ఎలా జాబితాలోకి వచ్చాయంటూ అభ్యర్థులు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా వారికి జవాబు చెప్పే నాథుడు లేడు. దీంతో పాత మెరిట్ జాబితాలో ఉన్న 8 మంది ఇటీవల ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.

2024 నియామకాలపైనా సందేహాలు..

అలాగే, 2024 డీఎస్సీ ఫలితాలు వెల్లడైన తర్వాత ఈ నెల 4వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. ఈ నియామకాల్లోనూ అనేక తప్పిదాలు దొర్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అభ్యర్థుల సందేహాలను విద్యాశాఖ అధికారులు నివృత్తి చేయకపోవడం అవినీతి జరిగిందన్న అనుమానాలకు తావిస్తోంది. జిల్లా విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులు, కొత్తగా డీఎస్సీ నియామకాలు జరిగినప్పుడల్లా మెరిట్ జాబితా ప్రదర్శించడం, రోస్టర్ కం రిజర్వేషన్ పాటించడం, సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో గందరగోళం జరగడం రివాజుగా మారుతోంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వెలువరించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా కరీంనగర్ జిల్లా విద్యాశాఖలో ప్రతిదీ ఆలస్యమవడం, ప్రక్రియను సాగదీయడం, అభ్యర్థుల ప్రశ్నలకు జవాబులు లేకపోవడం డీఎస్సీ నియామకాల్లో ఏం జరుగుతుందోనన్న చర్చకు కారణమవుతున్నాయి.

‘డబుల్’ ఇళ్లలో వసతులు కల్పించాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జిల్లాకేంద్రం శివారు నూకపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో వసతులను వేగవంతం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఇప్పటివరకు 4500 ఇళ్లు పూర్తయ్యాయని, గతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు వసతులు కల్పించలేదని తెలిపారు. ఆ ఇళ్లలోనూ వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్, తాగునీటి వసతి, డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ.36 కోట్లతో డబుల్‌బెడ్‌రూంలకు తాగునీరు కల్పించాలన్నారు. 14లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్, రూ.7 కోట్లతో సంప్ నిర్మాణం పూర్తయిందని, డ్రెయినేజీ, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం త్వరలో పూర్తవుతుందన్నారు. కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణం, కౌన్సిలర్ చాంద్ పాషా, ఏఈ రాజమల్లయ్య, చరణ్ పాల్గొన్నారు.

జంబిగద్దె పనులు పకడ్బందీగా చేపట్టాలి

జంబిగద్దె పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. జంబిగద్దె ఏర్పాట్లను పరిశీలించిన ఆయన అనాదిగా ఇక్కడే జంబి కొడతారని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఉన్నారు.

స్వచ్ఛనీటి సరఫరాకు ప్రణాళిక

- పంపు ఆపరేటర్లకు శిక్షణ
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- జిల్లాలో 380 గ్రామాలు
- 892 రక్షిత మంచినీటి ట్యాంకులు



చేతిపంపు మరమ్మతుపై సహాయకులకు వివరిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): మిషన్ భగీరథ పథకం ద్వారా ప్యూరిఫైడ్ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా.. స్వచ్ఛత లేని కారణంగా ప్రజలు వాటిని తాగేందుకు ఆసక్తి చూపడంలేదు. ఈ క్రమంలో స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అదించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరాకు అవసరమైన సిబ్బందిని గుర్తించి శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టింది. నిరంతరం నీటి సరఫరాపై పర్యవేక్షణ ఉండేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చి సమస్యలను త్వరగా పరిష్కరించాలనేది లక్ష్యం. గ్రామాల్లో తాగునీటికి ఉపయోగించే బోరుబావులు, ఇతర తాగునీటి వసతులను పునరుద్ధరించేలా.. వాటి మరమ్మతును సిబ్బంది సమర్థవంతంగా పూర్తి చేసేలా శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలో 380 గ్రామాలు.. 892 ట్యాంకులు

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలున్నాయి. 380 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటికి 892 రక్షిత మంచినీటి ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరాకు జిల్లాలో 3,063.48 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేసి 2,26,385 ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయకపోయినా.. పైపులైన్ ఎక్కడైనా పగిలినా నీరు కలుషితమయ్యే అవకాశాలున్నాయి. నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే మరమ్మతు చేయాల్సిన టెక్నీషియన్లు సమయానికి రాకపోతే నీటి సరఫరా నిలిచిపోయి సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉంది. అత్యవసర సమయాల్లో గ్రామ పంచాయతీలే స్వయంగా వీటిని మరమ్మతు చేసుకునేలా గ్రామానికో మంచినీటి సహాయకుడికి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుకోవాలని జల్‌జీవన్ మిషన్ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ శాఖ ద్వారా నిర్ణయించింది.

నాలుగు అంశాలపై శిక్షణ



బోరు స్టార్టర్ మరమ్మతుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రతి గ్రామపంచాయతీలో 45 ఏళ్ల వయస్సు ఉండి.. 8వ తరగతి చదువుకున్న వారిని వాటర్‌మెన్‌గా.. ఆ అర్హతలు లేకుంటే కారోబార్, మల్టీపర్పస్ వర్కర్‌ను మంచినీటి సహాయకుడిగా ఎంపిక చేశారు. వీరికి నీటినాణ్యత సంరక్షణ, ఎలక్ట్రికల్ బోర్డు, పంపుసెట్ల నిర్వహణ, చేతిపంపుల మరమ్మతు, ప్లంబింగ్‌పై నాలుగురోజులపాటు నిపుణులతో ఈనెల 10లోగా శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఉదయం వేళ పాఠాలు చెప్పి మధ్యాహ్నంవేళ క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా వివరిస్తారు.

శిక్షణలో చాలా నేర్చుకున్న



గ్రామాల్లో నీటి సరఫరా పర్యవేక్షణకు కొత్తగా మంచినీటి సహాయకులను నియమించారు. శిక్షణలో పాఠాలు చెప్పి క్షేత్రస్థాయిలో ఎలా మరమ్మతు చేయాలో అవగాహన కల్పిస్తున్నారు. పైపులైన్, బోర్లను త్వరగా మరమ్మతు చేయడంపై శిక్షణ ఇచ్చారు.

– కొత్తూరు శ్రీకాంత్, మంచినీటి సహాయకుడు, ఇబ్రహీంపట్నం

శిక్షణ ఇస్తున్నాం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం. మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. సమస్యలు వస్తే సత్వరమే పరిష్కరించి యథావిధిగా నీరు సరఫరా అయ్యేలా చూస్తాం. జిల్లాలో 12 సెంటర్లలో మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులుంటాయి. నీటి సరఫరాకు నాణ్యత ప్రమాణాలు పాటించేలా శిక్షణ ఇస్తున్నాం.

– రమేశ్, ఈఈ, మిషన్ భగీరథ

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ
- అదనపు కలెక్టర్ రాంబాబు
- బాధితుల నుంచి అర్జీల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల: ప్రజావాణికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు వస్తారని, వారి ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ వారికి జవాబు ఇవ్వాలన్నారు. వివిధ సమస్యలపై 25 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా భూకబ్జా, పెన్షన్లపైనే ఉన్నాయి. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాస్, ఏవో హన్మంతరావు, రఘువరణ్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కమిటీ ఏర్పాటు చేయాలి



జిల్లాలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2013 ప్రకారం కమిటీలు జిల్లాస్థాయిలో లేవు. ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, ఆర్టీసీ, బ్యాంకులు, కార్మానాలు, తదితర వాటిలో మహిళ కమిటీలు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. మహిళా ఉద్యోగులు ఎక్కువగా ఉన్న ఆరోగ్య వైద్యశాఖ, మహిళాశిశు సంక్షేమ శాఖల్లో కమి టీలు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. వెంటనే కమిటీలు ఏర్పాటు చేయాలి.

– గంగం జలజ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు

భూమిని కబ్జా చేశారు



గాంధీనగర్‌లో నాకున్న ఇంటి స్థలంలో మున్సిపల్‌లో గిరిధర్ పేరిట నమోదైంది. నా పేరు రికార్డు నుంచి తొలగించి వారికి వారే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మున్సిపల్ చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదు. 1989లో రికార్డులో నా పేరు ఉంది. వాటిని పరిశీలించి గిరిధర్ పేరు తొలగించి నా పేరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– బొల్లారపు మైసవ్వ

అదనపు కలెక్టర్స్ వర్సెస్ మున్సిపల్ కమిషనర్

- ప్రజావాణిలోనే వాగ్వివాదం
- కమిషనర్ ప్రజావాణికి రాకపోవడంపై ప్రశ్నించిన జేసీ



అదనపు కలెక్టర్లు, కమిషనర్ వాగ్వివాదం

జగిత్యాల: కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జగిత్యాల మున్సిపల్ కమిషనర్ రాకపోవడంపై అదనపు కలెక్టర్లు సీరియస్ అయ్యారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్‌రెడ్డి అర్జీలు స్వీకరించగా.. అత్యధికంగా జగిత్యాల బల్దియాకు సంబంధించినవే ఎక్కువగా వచ్చాయి. బాధితులకు సమాధానం ఇచ్చేందుకు మున్సిపల్ నుంచి అధికారులెవరూ లేరు. మధ్యాహ్నం సమయంలో కమిషనర్ సమ్మయ్య ప్రజావాణికి చేరుకున్నారు. దీంతో అదనపు కలెక్టర్లు ×మీకు ఇంటిమేషన్ లేదా ఇంత లేట్‌గా వస్తే ఎలా..‡ అని కమిషనర్‌ను ప్రశ్నించారు. తాను కూడా గ్రూప్–1 ఆఫీసర్‌నేనని, ఎమ్మెల్యే కార్యక్రమాలు ఉండటంతో రాలేకపోయానని, వేరే అధికారిని వెళ్లమన్నానని సమాధానం ఇవ్వడంతో అదనపు కలెక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అందరూ బిజీగా ఉంటారని, తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పర్సనల్ సెక్రటరీలు కాల్ చేసినా స్పందించకపోవడం ఏంటని అన్నారు. దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించినట్లు అదనపు కలెక్టర్లు తెలిపారు.

మైనార్టీల హక్కుల సాధనకు కృషి



మాట్లాడుతున్న అమేర్ అలీ ఖాన్

కోరుట్ల: మైనార్టీల హక్కుల సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ అన్నారు. మైనార్టీ రైట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీల హక్కులను విస్మరించిందని, ప్రస్తుతం రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతంపేరిట వైరుధ్యాలు సృష్టిస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టం విషయంలోనూ కేంద్రం అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. కోరుట్లలో ఉర్దూ మీడియం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ ఉర్దూ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ ముస్లింల వెంట నడిచింది కాంగ్రెసేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, తిరుమల గంగాధర్, నయీం, మౌలానా మజార్ హాస్మి, కోరుట్ల ఉర్దూ ఘర్ చైర్మన్ కాలిక్, సంచార ముస్లిం తెగల జిల్లా కన్వీనర్, తబ్రేజ్, షాకీర్, నజీబోద్దీన్, ఖయ్యూం, సోగ్రాబీ, అక్బర్, రషీద్, హుస్సేన్ జమాతే ఇస్లామీ పట్టణ అధ్యక్షుడు ఇల్యాస్‌ఖాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్పత్రిపై చర్యలకు సిద్ధం



స్కానింగ్ యంత్రాల గదిని సీజ్ చేస్తున్న వైద్యబృందం

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌లో గల ఓ ఆస్పత్రిపై చర్యలు తీసుకునేందుకు వైద్యశాఖ అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇటీవల వైద్యశాఖ ఆధ్వర్యంలో మెటర్నరీ హెల్త్ అండ్ న్యూట్రిషియన్ బృందం జిల్లాకేంద్రంలోని ఆస్పత్రులను తనిఖీ చేసిన విషయం తెల్సిందే. ఇందులో భాగంగా ఓ ఆస్పత్రిలో అనధికారికంగా ఉన్న మూడు స్కానింగ్ మిషన్లను సీజ్ చేశారు. ఆస్పత్రిలో ఆన్‌లైన్‌లో రికార్డు చేయకపోవడం, పేషెంట్ వివరాలు లేకపోవడం గుర్తించింది. స్కానింగ్ మిషన్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కావాల్సి ఉన్నా అనధికారికంగా ఉండటంతో సీజ్ చేశారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సదరు ఆస్పత్రిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

పండగ పూట పస్తులా?

జగిత్యాల: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తక్షణమే బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. వేతనాలు ఇవ్వకపోవడంతో పండుగపూట పస్తుంలుండాలా..? అని ప్రశ్నించారు. పల్లెల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్‌యార్డులు, పల్లెప్రకృతివనం, తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తున్నామని, ఉద్యోగానికి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, కోమటి చంద్రశేఖర్, పులి మల్లేశం, రమేశ్, మల్లవ్వ పాల్గొన్నారు.

వరద కాలువలో వృద్ధుడి మృతదేహం

- నిజామాబాద్‌వాసిగా గుర్తింపు

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువలో సోమవారం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండలం దొన్కల్ గ్రామానికి చెందిన రామగిరి నర్సయ్య(70)గా గుర్తించామన్నారు. ఈ నెల 5న అతను అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు మోర్తాడు పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కథలాపూర్ హెడ్‌కానిస్టేబుల్ మధుకర్, కానిస్టేబుల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం



సాయికుమార్ (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం .. పెద్దపల్లి జిల్లా గొరెడ్డిపేటకు చెందిన కాసర్ల సాయికుమార్(22) ధర్మారం మండలం శాయంపేటలోని బంధువుల ఇంట్లో ఉంటూ ధర్మారం అర్బన్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఎండపల్లి మండలంలోని గుల్లకోటకు చెందిన పాలకుర్తి సాగర్‌ను అతని ఇంటివద్ద దింపడానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగివస్తుండగా గుల్లకోట ఐకేపీ సెంటర్ సమీపంలో చెట్టును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాలీబాల్ క్రీడ.. 'జూలపల్లి' అడ్డా

- ఆటలో రాణిస్తున్న మండల క్రీడాకారులు
- జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లలో సత్తా
- క్రీడా కోటాలో పోలీస్ శాఖతోపాటు ప్రైవేటు ఉద్యోగాల సాధన
- ఇద్దరు ఎస్సైలుగా, 35 మంది కానిస్టేబుళ్లుగా ఎంపిక
- ఏటా వాలీబాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు



టోర్నమెంట్‌లో జూలపల్లి వాలీబాల్ జట్టు క్రీడాకారులు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): జూలపల్లి మండలం.. వాలీబాల్ క్రీడకు పెట్టింది పేరు. 30 ఏళ్లుగా ఇక్కడి యువకులు వాలీబాల్ క్రీడలో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు, మెమొంటోలు గెలిచి, క్రీడా కోటాలో ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో ఉద్యోగాలు సాధించి, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, కళాశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానంలో ప్రతీరోజు వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తూ నైపుణ్యం పొందిన యువకులు.. కొత్తగా ఆడేందుకు వచ్చే వారికి మెలకువలు నేర్పుతూ వాలీబాల్ వారు ఆటలో రాణించేందుకు సహయ సహకారాలు అందిస్తున్నారు.

టోర్నమెంట్ ఎక్కడైనా జూలపల్లి టీంలు..

జిల్లా, రాష్ట్రస్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ ఉంటే జూలపల్లి మండలం నుంచి జూనియర్, సీనియర్ జట్లు ఉండాల్సిందే. అంతలా వాలీబాల్ క్రీడలో ఇక్కడి యువత రాణిస్తున్నారు. అంతేకాదు.. ట్రోఫీ సాధిస్తుందన్న నమ్మకం కూడా మండలవాసుల్లో బలంగా ఉంది.

క్రీడా కోటాలో పలువురికి ఉద్యోగాలు..

వాలీబాల్ ఆటలో రాణిస్తున్న మండల యువతలో ఇద్దరు ఎస్సై, 35 మంది సివిల్, సీఆర్‌పీఎఫ్, ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుల్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో, పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉద్యోగాలు సాధించారు. రాబోయే పోలీస్ రిక్రూట్‌మెంటులో మరికొందరు క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించేందుకు సాధన చేస్తున్నారు.

20 ఏళ్లుగా శిక్షణ



జూలపల్లిలో 20 ఏళ్లుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులకు వాలీబాల్‌తోపాటు ఇతర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు ఆటల్లో నైపుణ్యం పెంచుతూ ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు కృషి చేస్తున్నాం.

– బొమ్మెనవేని సతీశ్, అబ్బాపూర్, పీఈటీ, శిక్షణ శిబిరం కోచ్

శారీరక, మానసికోల్లాసం ..



క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుంది. యువకులు ఆరోగ్యంగా ఉండటమే కాక, ఉద్యోగ సాధనలో ఎంతగానో ఉపయోగపడతాయి. ఏటా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ కేంద్రంలో విద్యార్థులు ఆటలు నేర్చుకోవాలి.

– దామెర కమలాకర్ రెడ్డి, బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగి, కోనరావుపేట

క్రీడా కోటాలో ఉద్యోగం



నేడు వాలీబాల్ జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లలో ఆడాను. మా జట్టు తరపున ఎన్నో మెమొంటోలు సాధించాం. నాకు క్రీడా కోటాలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి.

– ఖాజామియా, ఏపీఎస్పీ కానిస్టేబుల్, జూలపల్లి

క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి



విద్యార్థులు, యువకులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి. ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉన్నందున ఆ దిశగా లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలి. క్రీడలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వడమే కాక ఆరోగ్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయి.

– అమరగాని గంగాధర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, కానిస్టేబుల్, జూలపల్లి

నంది వాహనంపై శ్రీలక్ష్మీనృసింహుడు



ధర్మపురిలో నంది వాహనంపై శ్రీలక్ష్మీనృసింహులు

ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి వారు సోమవారం నంది వాహనంపై ఊరేగించారు. పట్టణ పురవీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

పెరటి కోళ్ల పెంపకానికి స్త్రీనిధి రుణాలు

- స్త్రీనిధి జిల్లా మేనేజర్ వెంకటేశ్



చింతలపేటలో యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: పెరటి కోళ్ల పెంపకానికి స్త్రీనిధి ద్వారా మహిళాసంఘాలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ వెంకటేశ్ అన్నారు. మెట్‌పల్లి మండలం చింతలపేటలో పెరటికోళ్ల మదర్ యూనిట్‌ను సోమవారం సందర్శించారు. గ్రామానికి చెందిన సరస్వతి సంఘం సభ్యురాలైన ఉత్కం పద్మ స్త్రీనిధి ద్వారా రూ.2.91లక్షల రుణం తీసుకొని పెరటి కోళ్ల మదర్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఆ యూనిట్‌ను స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళాసంఘాల సభ్యులకు వీటి ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటూనే గుడ్లు, మాంసం విక్రయించి పౌష్టికాహారం అందించవచ్చన్నారు. పెరటి కోళ్ల పెంపకం తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం విమోచన, సీసీ, వీవోఏ, ఓబీలు, మహిళలు పాల్గొన్నారు.

దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు



దుబాయిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కోరుట్లరూరల్/రాయికల్: ఎమిరెట్స్ తెలంగాణ సాంస్కృతిక సంక్షేమ సంఘం (ఈటీసీఏ) ఆధ్వర్యంలో సోమవారం దుబాయ్‌లోని ఇండోర్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సుమారు 5 వేల మంది సంబరాల్లో పాల్గొన్నారు. వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇండియన్ కౌన్సెలెట్ దుబాయ్ నుంచి విజేందర్‌సింఘ్, సినీనటి నాగల్ల అనన్య, జానపద గాయని వరం, షార్ట్‌ఫిల్మ్ కమెడియన్ సదానందం హాజరయ్యారు. ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు పీచర్ల కిరణ్‌కుమార్, అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చీటి జగదీశ్‌రావు, రాణి, అన్నపూర్ణ, మౌనిక, విపుల, సారిక, దీపిక, మమత, సరోజ, సుధ, స్వప్న పాల్గొన్నారు.

రైతును బలితీసుకున్న విద్యుదాఘాతం

- గతంలోనే తల్లి మృతి
- అనాథగా మారిన ఒక్కగానొక్క కూతురు



అంజయ్య (ఫైల్)

పెగడపెల్లి(ధర్మపురి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందిన ఘటన పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో చోటుచేసుకొంది. గ్రామస్తులు, ఎస్సై రవికిరణ్ వివరాల ప్రకారం.. బతికెపల్లికి చెందిన బొమ్మెన్ల అంజయ్య(53) సోమవారం మధ్యాహ్నం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. మోటార్ ఆన్ చేసి, పైపును ముట్టుకోవడంతో విద్యుదాఘాతం సంభవించింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అంజయ్య సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో అతని సోదరి తమ పొలం పక్కనుండే మరో రైతుకు ఫోన్ చేసింది. ఆయన వెళ్లిచూడగా అంజయ్య చనిపోయి కనిపించాడు. వెంటనే పోలీసులకు, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. అంజయ్య భార్య గతంలోనే చనిపోయింది. మృతుడికి ఇంటర్ చదువుతున్న ఒక కూతురు ఉంది. అప్పుడు తల్లి, ఇప్పుడు తండ్రి మృతితో ఆమె అనాథగా మారింది. అంజయ్య సోదరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం: తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన చింతలపల్లి సతీశ్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి, తన సోదరి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, పరిశీలించగా 10 తులాల బంగారం , రూ.45 వేలు కనిపించలేదు. దొంగతనం జరిగిందని నిర్ధారించుకొని, పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సరికొత్తగా ఎల్ఐసీ పథకాలు



పథకాలను ఆవిష్కరిస్తున్న సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్‌రావు, అధికారులు

కరీంనగర్: బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ ఆదేశాలనుసారం ఈ నెల 1 నుంచి పాలసీదారులకు పథకాలను ఎల్ఐసీ సరికొత్తగా ఆవిష్కరించిందని సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్.వి.ప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని సంస్థ డివిజనల్ కార్యాలయంలో రీజినల్ మేనేజర్ బ్యాంక్ అష్యూరెన్స్ రాజీవ్ బిశ్వాస్, రీజినల్ మేనేజర్ లీగల్ శరవనన్‌లతో కలిసి పాలసీలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీమా అంటే ఎల్ఐసీ, ఎల్ఐసీ అంటే రక్షణ అని ప్రజల్లో ఒక నమ్మకం ఉందన్నారు. 68 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో పాలసీదారులకు మరింత మెరుగైన సేవలందించేలా పాలసీలను సరికొత్త ఫీచర్లతో ప్రారంభించిందని, వీటిని ప్రజలు ఆదరించాలని కోరారు. ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం ప్రీమియం కట్టిన తర్వాత కూడా పాలసీని ఎలాంటి నష్టం లేకుండా సరెండర్ చేసుకోవచ్చని తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కే.శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేశ్ ఖన్నా, డివిజనల్ మేనేజర్ నారాయణరావు, ప్రోడక్ట్ మేనేజర్ పాండురంగారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం శివారులో సోమవారం గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఖానాపూర్‌కు చెందిన సింగిరెడ్డి శ్రీధర్ కొన్ని రోజులుగా గంజాయి మత్తుకు అలవాటు పడ్డాడు. గంజాయి కొనుగోలు చేసి తాగగా మిగిలిన గంజాయితో సోమవారం వేములవాడ నుంచి ఆర్మూర్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో రుద్రంగి శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 70 మిల్లీగ్రాముల గంజాయి, సేవించటానికి వినియోగించే పైపు, అతని బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఇటీవల గోదావరిఖనిలో జరిగిన అండర్–19 జూనియర్ కళాశాల జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన జి.వివేక్, కె.సాయి, సిద్ధార్థ, ఎం.జ్ఞానేశ్వర్‌లను అభినందించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తూ అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయలతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నర్సయ్య మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అడ్లూరి నర్సయ్య(40) సోమవారం బైక్‌పై మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజుపల్లికి వచ్చి, తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సంగెం–శ్రీరాంపూర్ వద్ద గ్యాస్ సిలిండర్ల లోడ్ ఉన్న టాటాఏస్ వాహనాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపి ఉంచాడు. నర్సయ్య అతివేగంగా వచ్చి, ఆ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్లు అప్పగింత



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: పలువురు పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్లను ఎస్పీ అశోక్‌కుమార్ జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం బాధితులకు అప్పగించారు. మొత్తం 104 ఫోన్ల విలువ రూ.20 లక్షలు ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో వివరాలు నమోదు చేస్తే ఫోన్ ఎక్కడుందో తెలుసుకోవచ్చన్నారు. సెల్‌ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబర్చిన ఐటీకోర్ సీఐ రఫీక్‌ఖాన్, సీఈఐఆర్ ఆర్ఎస్ఐ కృష్ణ, హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్, కానిస్టేబుళ్లు అజర్, మల్లేశంను అభినందించారు.

పాస్‌పోర్టు తీసుకున్నరు.. ఒక్కపూటే తింటున్న

- ఏజెంట్ మోసం చేశాడు.. స్వగ్రామం వచ్చేలా చూడండి..
- ఇరాక్‌లో సారంగాపూర్ యువకుడి ఇబ్బందులు
- వీడియో తీసి పంపిన బాధితుడు



ఇరాక్‌లో అజయ్

సారంగాపూర్(జగిత్యాల): నా పాస్‌పోర్టు లాయర్ తీసుకున్నరు.. ఒక్కపూటే తింటున్న.. నన్ను ఏజెంట్ మోసం చేశాడు.. స్వగ్రామం వచ్చేలా చూడండి.. అంటూ ఇరాక్ వెళ్లిన సారంగాపూర్ యువకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం తనను ఇంటికి వచ్చేలా చొరవ చూపాలని కోరుతూ ఓ వీడియో రికార్డు చేసి, స్థానిక విలేకరులకు పంపించాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లపు అజయ్‌ది నిరుపేద కుటుంబం. తల్లితండ్రులు రాధ–గంగయ్య వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన ఓ ఏజెంట్ ఇరాక్‌లో వేతనాలు బాగా ఉంటాయని, తనతో కలిసి పని చేస్తాడని నమ్మబలకడంతో అజయ్ అతనికి రూ.2.70 లక్షలు చెల్లించాడు. ఏజెంట్ ఇరాక్ వెళ్లి, 14 నెలల క్రితం అజయ్‌ని అక్కడికి రప్పించుకున్నాడు. కానీ, వెళ్లినప్పటి నుంచి ఎలాంటి పని లేకపోవడంతో అతను గదికే పరిమితమయ్యాడు. ఉపాధి కోసం వెళ్లిన అజయ్‌కి తిండి దొరకడం కూడా కష్టంగా మారింది. నిత్యం తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ తన పరిస్థితిని వివరిస్తున్నాడు. ఒక్కపూటే తింటున్నానని, తన వద్ద ఐడీ కార్డు లేదని, పాస్‌పోర్టును ఇక్కడి లాయర్ తీసుకున్నారని, తాను ఇంటికి వస్తానంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొడుకు బాధ చూడలేక అతని తిండికి, స్వగ్రామం రావడానికి తల్లిదండ్రులు 3 నెలల క్రితం రూ.లక్ష, 20 రోజుల క్రితం మరో రూ.66 వేలు పంపించారు. కానీ, పాస్‌పోర్టును అక్కడి అడ్వకేట్ తీసుకోవడంతో తమ కొడుకు ఇంటికి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాడని వారు రోదిస్తున్నారు. అజయ్ ఇక్కడికి వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): క్షణికావేశంలో పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన శనిగరపు మహేందర్ (22) దళితబంధులో వచ్చిన ట్రాక్టర్ అమ్మి కారు కొనివ్వాలని ఆదివారం తండ్రితో వాగ్వాదానికి దిగాడు. తండ్రి ట్రాక్టర్‌నే నడుపుకుందామని తెలపడంతో మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లిపురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి భద్రయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ సంపత్ వివరించారు.

రాజన్నా శరణు..శరణు



వేములవాడ : రాజన్నను సోమవారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దసరా సెలవులు కొనసాగుతుండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సభ్యులతో తరలివస్తున్నారు. భక్తుల ద్వారా రూ.9 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



